అరుణోదయ జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 17 ఆగస్టు 2023

విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు రావాలి : డీఐఈఓ

నవతెలంగాణ-తాంసి

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు వచ్చి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సి.రవీందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్, విద్యార్థుల బోధనకు సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించి ప్రిన్సిపాల్‌కు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధన మెరుగు పడుతోందన్నారు. విద్యార్థి కూడా ప్రతి రోజూ కళాశాలకు వచ్చి శ్రద్ధగా పాఠాలు వినాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, కళాశాల సిబ్బంది సంతోష్, మల్లేష్ పాల్గొన్నారు.

4వ రోజు పల్లెపల్లెకు కాంగ్రెస్ పాదయాత్ర

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మారావుపేటలో 4వ రోజు పల్లెపల్లెకు కాంగ్రెస్ పాదయాత్ర బుధవారం ప్రారంభించారు. ధర్మారావుపేట గ్రామం నుండి తాటిగూడెం, కొండాపూర్, కోనూరు, భోజనానంతరం, తంగళ్ళపల్లి, కనికలాపూర్, పల్లంగుడా మీదుగా పాదయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్ వేముల కృష్ణ, నియోజకవర్గం నాయకులు రాష్ట్ర మహిళా కార్యదర్శి రొడ్డ శారద, నాతరి స్వామి, బెల్లంపల్లి మండల నాయకులు రొడ్డ శ్యాం, ఎంపిటిసిలు పార్వతి మల్లేష్, మెరుగు పద్మ శంకర్ ,కోనూరు సర్పంచ్ అప్పని స్వరూప శ్రీనివాస్, ఉప సర్పంచ్ పత్తిపాక రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ చెల్లె రవి, మాజీ సర్పంచ్‌లు ప్రభాత్‌రావు, జాడి శంకర్, ఓరియంట్ కార్మిక సంఘం అధ్యక్షులు అన్నం కుమార్, సీనియర్ నాయకులు జనార్ధన్‌రెడ్డి కనకరాజు, మడావి వెంకటేష్, మైదం రమేష్, మైనారిటీ సెల్ షాకీర్, ఖదీర్, కలీం, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, జంగిలి రమేష్ పాల్గొన్నారు.

చినుకమ్మా..ఒక్కసారి రావమ్మా..!

- వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- జులైలోనే రికార్డుస్థాయిలో అధిక వర్షపాతం నమోదు
- కాలానుగుణంగా లేకపోవడంతో పంటలకు ఇబ్బంది
- పంటల ఎదుగుదలపై అన్నదాతల్లో ఆందోళన

అతివృష్టి..అనావృష్టి ఈ రెండింటిలో ఏది ఉత్పన్నమైనా సాగుకు గడ్డుకాలం తప్పదు. మొన్నటి వరకు కుంభవృష్టి వర్షాలతో అతలాకుతలమైన పంటలు..నేడు అదే వర్షం కోసం ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తింది. కేవలం పక్షం రోజుల్లోనే పరిస్థితి తారుమారైంది. వాతావరణంలో అనూహ్య మార్పులు సంభవించడం కారణంగా వర్షాలు నిలిచిపోయాయి. ఎదిగే క్రమంలో పంటలన్నీ చినుకు కోసం తాపత్రయ పడుతున్నాయి. పదిహేను రోజుల క్రితం వర్షాలు ఆగిపోవాలని కోరుకున్న రైతులే నేడు వస్తే బాగుంటుందని ఆశపడుతున్నారు. ఉదయం, పగటి వేళలో మేఘాలు కమ్ముకుంటున్నా చినుకులు మాత్రం రావడం లేదు. ఫలితంగా అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరదలతో నష్టపోగా మిగిలిన పంటలనైనా పండుతాయని భావించిన కర్షకులకు వాతావరణం సహకరించడం లేదు. జీవం పోయాల్సిన వర్షాలు ముఖం చాటేయడంతో పంటల ఎదుగుదల లోపిస్తోంది. మరో రెండు రోజుల వరకు ఇదే వాతావరణం ఉంటే పంటలు చాలా వరకు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణం అనూహ్య మార్పులకు కారణమవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తగా.. జులైలో కుండపోత వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి పంటలన్నీ నీట మునిగాయి. సుమారు పది రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంటలన్నీ వర్షార్పణమయ్యాయి. వారం రోజులకుపైగా నీటిలోనే ఉండటంతో చాలా చోట్ల మురిగిపోయి ఎదుగుదల లోపించింది. నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు కొట్టుకుపోవడంలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రభుత్వం అధికారికంగా సర్వేకు ఆదేశాలివ్వకపోవడం.. అటు ఫసల్ బీమా సౌకర్యం కూడా లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నష్టపోయిన పంటలకు పరిహారం కూడా రాలేని పరిస్థితి దాపురించింది. అధిక వర్షాల కారణంగా ఇప్పటికే పంట నష్టం జరగ్గా.. పదిహేను రోజుల నుంచి అసలు చినుకే జాడ లేకపోవడంతో మిగిలిన పంటలకు జీవం లేక ఎదుగలేని పరిస్థితికి దారితీస్తోంది. ప్రస్తుతం ఎండల ప్రభావం ఉండటం.. పంట పొలాల్లో తేమ ఆరిపోవడంతో మొక్కకు నీరందడం లేదు. ఈ క్రమంలో రసం పీల్చే పురుగులు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. నీటిలో కరిగే ఎరువులు వేయాలని సూచిస్తున్నారు.

జులైలోనే అధిక వర్షం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 16లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో 11 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుండగా.. మిగిలిన సోయా, కంది తదితర పంటలు వేశారు. కిందటి నెల జులైలో భారీ వర్షాలు కురవడంతో జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల రోజూ 225మి.మి వరకు వర్షపాతం నమోదైంది. జులై రెండో వారం నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో కురవాల్సిన వర్షం కూడా జులైలోనే నమోదు కావడంతో పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఇప్పటికీ వర్షపాత లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో నాలుగు మండలాల్లో మినహా అన్నింటిలో సాధారణం కంటే 20 శాతం అధికవర్షపాతమే నమోదై ఉంది. లెక్కల ప్రకారం అధిక వర్షపాతం ఉన్నా.. కాలానికి అనుగుణంగా కురవకపోవడంతో పంటల పరిస్థితి దయనీయంగా మారింది. జూన్‌లో దాదాపు 50శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా.. జులైలో ఏకంగా రికార్డు స్థాయిలో 70సె.మీల వర్షం కురిసింది. ప్రస్తుతం పంటలకు వర్షం కావాల్సి ఉండగా.. జాడలేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కనిపిస్తే పంటల పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని రైతులు చెబుతున్నారు.

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం : రాదారపు అనిల్, రైతు, తాంసి



ఐదు ఎకరాలు సొంత భూమితో పాటు మరో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాను. పక్షం రోజుల క్రితం వరకు అధిక వర్షాలు కురవడంతో పొలంలో నీరు నిండుకుంది. దీంతో గడ్డి విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం గడ్డి తొలగించి మందులు పిచికారి చేయడంతో పంట ఎదుగుదలకు వచ్చింది. కానీ ఇదే సమయంలో వర్షాలు రాకపోవడంతో పంట ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. వర్షం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నాం.

కలెక్టరేట్ ఎదుట రెండో ఏఎన్ఎంల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్‌ఏ పోస్టుల భర్తీ కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయడంతో పాటు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లంక రాఘవులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్‌కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్, చిన్నన్నతో కలిసి సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1520 పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించి సెలక్ట్ చేయబోతోందన్నారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగులు కూడా పరీక్ష రాయాల్సి వస్తోందని, మెరిట్ వస్తేనే సెలక్ట్ అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. సర్వీసుకు 20 మార్కులు వెయిటేజి ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. గత 20 సంవత్సరాలుగా వీరంతా పని చేస్తున్నారని, గతంలో డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. మళ్లీ వీరిని పరీక్ష రాయమనడం న్యాయం కాదన్నారు. ఇప్పటికే చాలామందికి ఏజ్ బార్ అయ్యిందన్నారు. వీరిని ఖాళీ పోస్టులలో సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. అలాగే ఇతర జీతభత్యాలు, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యాక్సిన్ అలవెన్స్ రూ.500, యూనిఫాం అలవెన్స్ రూ.2,500 ఇవ్వాలన్నారు. 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వాలని, నైట్ డ్యూటీలు, ఓపి డ్యూటీలు రద్దు చేయాలని, బదిలీకి అవకాశం కల్పించాలన్నారు. అలాగే విధి నిర్వహణలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఫీల్డ్ డ్యూటీ చేస్తున్నందున ఎఫ్‌టిఏ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



హాజీపూర్ : ఏఎన్ఎంల పట్ల ప్రభుత్వ విధానం మార్చుకొని అందరినీ రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద సమ్మెను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అన్ని రకాల కాంట్రాక్ట్ ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోమాస ప్రకాష్ , జిల్లా అధ్యక్షురాలు పద్మ తులసి, రమ, సరిత, సత్యవతి, రాజేశ్వరి, విజయ పాల్గొన్నారు.

ఆర్కే-5 గనిని సందర్శించిన కోల్ ఇండియా అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనిని కోల్ ఇండియా అధికారులు అంజనీ కుమార్(సీనియర్ మేనేజర్), నందకిషోర్ యాదవ్ (డిప్యూటీ మేనేజర్), నసీం పర్వేజ్(సర్వేయర్), లఖన్ లాల్ మహాతో కూడిన సిసిఎల్ టీం బుధవారం సందర్శించింది. గని లోపల పని ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆర్కె5,6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి ఎత్తు తక్కువ ప్రదేశాల్లో బొగ్గు ఉత్పత్తికి సింగరేణిలో అనుసరిస్తున్న విధానాలను సీసీఎల్ బృందానికి వివరించారు. పోల్ ఇండియాలో భూగర్భ గనులు మూతపడుతున్నందున థిం సీమ్‌లలో ఎత్తు తక్కువగా ఉన్న ప్రదేశంలో బొగ్గు ఎలా తీయాలో అనే అంశంపై అధ్యయనం కొనసాగింది. థిం సీములలో ఎస్డీఎల్ యంత్రాల ద్వారా బొగ్గు ఎలా వెలికితీయొచ్చో గమనించారు. కోల్ ఇండియాలో సైతం థిన్ సీముల్లో బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణిలో అనుసరిస్తున్న విధానాల అవగాహన కోసం సీసీఎల్ సీఎండీ, కోల్ ఇండియా డైరెక్టర్ టెక్నికల్ వీరారెడ్డి విజ్ఞప్తి మేరకు ఆర్కే 5 అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్కే 5లో పని విధానాలు, రక్షణ ఏర్పాట్లు పరిశీలించిన సీసీఎల్ సభ్యులు గని యంత్రాంగాన్ని, సింగరేణి సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఏవిరెడ్డి, ఇంచార్జి మేనేజర్ శివయ్య, పిట్ ఇంజనీర్ రాధాకృష్ణ, సర్వేయర్ లక్ష్మణ్ , కిరణ్ పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆయిల్‌ఫామ్ సాగుపై ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణారావు, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఇదివరకు సాగు చేస్తున్న రైతులకు మొక్కలు ఏపుగా పెరగడానికి మెళుకువలు, జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు అధిక లాభాలు వస్తాయన్నారు. రైతుల సాగులోని సందేహాలను నివృత్తి చేశారు. మొక్కలు పెట్టిన నాటినుండి కోతకు వచ్చేవరకు ఎలాంటి సందేహాలు వచ్చిన వ్యవసాయ అధికారులు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసిసి ఛైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో లెప్రసీ వ్యాధి నివారణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుష్టు వ్యాధి సర్వేకు సంబంధించిన కరపత్రాలను జిల్లా వైద్యాధికారి రామకృష్ణతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి నివారణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. కుష్టు వ్యాధి వచ్చిన వారిని గుర్తించి వారికి ఆరు నుండి 12 నెలల పాటు నిరంతర చికిత్స చేయాలని, అవసరమైన మందులు అందజేసినట్లయితే వ్యాధి నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలా గుర్తించడానికి ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 16 నుండి 31 వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. లెప్రసీ ఉన్న వ్యాధిగ్రస్తులను అప్పటికప్పుడే "రిఫాంపియన్" మందును అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, డిపిఓ ధరమ్‌సింగ్, డిపిఎంఓ రమేష్, డీఈఎంవో రషీద్, హెచ్ఈఓ శ్యాంలాల్ పాల్గొన్నారు.

అనర్హులను ఖాళీ చేయించి అర్హులకు ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-ఖానాపూర్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అవకతవకలు జరిగాయని, అనర్హులను ఖాళీ చేయించి అర్హులకు ఇల్లు ఇవ్వాలని కోరుతూ బుధవారం 12 వార్డులకు సంబంధించిన మహిళలు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సుమారు 160 మంది అనర్హులకు చోటు కల్పించారని, అలాంటి వారిని వెంటనే ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. ఇండ్లు ప్లాట్లు వ్యవసాయ భూములు ఉన్నవాళ్ళకు డబుల్ బెడ్ రూములు ఇచ్చారని, గజం భూమి కూడా లేని తమలాంటి నిరుపేదలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు కౌన్సిలర్లు డబ్బులు తీసుకున్నారని మహిళలు ఆరోపించారు. అందుకే తమ బాధలను పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

మాస్టర్ ప్లాన్ మార్చి తీరాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మహేశ్వర్‌రెడ్డి గృహనిర్బంధానికి నిరసనగా బుధవారం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాలకు చెందిన బీజేపీ నాయకులు మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరేష్ కుమార్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వరరెడ్డి రైతులకు, ఆయా గ్రామాలకు మద్దతుగా ధర్నా చేపట్టాలని నిర్ణయించారన్నారు. పోలీసులు ఆయనను అక్రమంగా గృహనిర్బంధం చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకుల స్వార్థం కొరకు ఈ మాస్టర్ ప్లాన్ చేయించారని, మాస్టర్ ప్లాన్ నుండి కొన్ని గ్రామాలను తొలగించి మార్చి తీరాలని డిమాండ్ చేశారు. వెంటనే ధర్నా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల బీజేపీ అధ్యక్షులు శైలేశ్వర్, అర్జున్ నాయకులు మంద మల్లేష్, శ్రీకాంత్‌రెడ్డి, రమణ, నిరంజన్‌రెడ్డి, సాయిరెడ్డి, రామ్‌రెడ్డి, సాయి, సాయన్న, సుధాకర్, యోగేందర్‌రెడ్డి, రమేష్, విజయ్, ముత్యం, ఉదయ్ గౌడ్, నడ్పి ముత్యం పాల్గొన్నారు.

మద్యం మత్తులో వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ - భీమిని

చిన్న గుడిపేట గ్రామానికి చెందిన రాసా పర్వతాలు(76) మద్యానికి బానిసై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..నిత్యం మద్యం తాగుతుండగా కుటుంబ సభ్యులు మందలిస్తున్నారు. మంగళవారం సైతం బాగా తాగి ఇంటికి రావడంతో భార్య మల్లక్క ఎందుకు మళ్లీ తాగి వచ్చావంటూ మందలించింది. నేనింతే మారను అంటూ పర్వతాలు మద్యం మత్తులో పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చనిపోయాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న 5కె రన్

నవతెలంగాణ-నస్పూర్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 19న జిల్లాలో ఐ ఓట్ ఫర్ షూర్ (నేను కచ్చితంగా ఓటు వేస్తాను) అనే నినాదంతో 5కె రన్ నిర్వహిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న ఉదయం 6గంటలకు జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాలలో 5కె రన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాసిపేట : మండల కేంద్రానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు దుర్గం రాంచందర్ భార్య దుర్గం విజయ అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, రైతుబంధు అధ్యక్షుడు దుర్గం పోశం, నస్పూరి నర్సింగ్, సర్పంచ్ దేవి, ఉప సర్పంచ్ పిట్టల సుమన్, నాయకులు దుర్గం గోపాల్, రాంటెంకి వాల్దేవ్, జాడి రాంచందర్, దాగం మల్లేశ్, అక్కెపల్లి బుగ్గ రాజు పాల్గొన్నారు.

ధర్మారావుపేటలో గొర్రెల పంపిణీ

కాసిపేట : మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో బుధవారం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 6 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి గొర్రెలు పంపిణీ చేస్తామని నాయకులు, అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి సంపత్, జిల్లా గొర్రెల పెంపకందారులు సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్ యాదవ్, ఎంపీటీసీ మల్లేశ్, సందనవేణి మల్లేశ్, వేల్పుల బలరాం, చంద్రయ్య, ముదుత రాజన్న, సంజనపు చారి, కొమ్ము శంకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానివన్నీ గొప్పలే

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్

బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు విమర్శించారు. బుధవారం సారంగాపూర్ మండలం వంజర్ గ్రామానికి చెందిన పలువురు మండల నాయకులు సుభాష్‌రెడ్డి, శేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ డ్రామాలు ఆడుతూ కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని, తెలంగాణ సమాజానికి పూర్తిగా అర్థమైందని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. రాబోవు రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఇందిరమ్మ రాజ్యంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బొల్లోజి నర్సయ్య, నాయకులు షేక్ సలీం, రవి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష విధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత శుక్రవారం జరిగిన పోల్కార్ సుధాకర్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద బాధితులతో కలిసి నిందితుల దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన సుధాకర్‌ను ఇద్దరు వ్యక్తులు కలిసి హత్య చేశారని, దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. నిందితులను పట్టుకొని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుని కుటుంబ సభ్యులు రోడ్డున పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత వ్యక్తి హత్యకు గురైతే కనీసం పోలీసులు స్పందించడం లేదన్నారు. నిందితులను పట్టుకొని అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలని, లేదంటే ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగుంట మహేష్, రేగుంట సాగర్, మహిళా నాయకురాలు రేగుంట రాజేశ్వరి, దుర్గం రేణుక, భాగ్య, జయ పాల్గొన్నారు.

ఎరుకల అభివృద్ధి, సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-నిర్మల్

ఎరుకల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సీయం కేసీఆర్ ఖరారు చేసినందుకు పలువురు ఎరుకల కులస్తులు బుధవారం క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తమ సామాజిక వర్గాన్ని గుర్తించి సముచిత స్థానం కల్పించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తామంతా కేసీఆర్ వెంటే ఉంటామన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులన్నీ గిరిజనుల్లో ఉండే అన్ని తెగలకు సమానంగా అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సమాజానికి అవసరమైన విధంగా జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

రౌడీ షీటర్లపై చర్య తీసుకోవాలి



తాండూర్ : గుండాయిజాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పెంచి పోషిస్తున్నారని బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ అన్నారు. బహుజన సమాజ్ పార్టీ నాయకులు రవి ప్రసాద్‌పై బీఆర్ఎస్ రౌడీ షీటర్లు దాడి చేశారని తెలిపారు. బుధవారం మండలంలోని కాసిపేట గ్రామంలో బిజెపి నాయకులతో కలిసి వరప్రసాద్ ఇంటికెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎస్పీ నాయకునిపై భౌతిక దాడికి పాల్పడడం శోచనీయమన్నారు. ఆయనపై దాడి చేసిన కిరాయి రౌడీలను వెంటనే అరెస్ట్ చేయాల డిమాండ్ చేశారు. వారిపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దాడి వెనుక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వరప్రసాద్, ఎమ్మెల్యే ఒకే సామాజిక వర్గానికి చెందినవారని, వరప్రసాద్ రాజకీయంగా ఎదిగితే సామాజిక వర్గానికి చెందిన ఓట్లు చీలిపోతాయన్న భయంతో రవి ప్రసాద్‌పై దాడి చేయించారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాజులాల్ యాదవ్, ఎస్‌సి మోర్చా జిల్లా కార్యదర్శి నవీన్, నర్సింగ్, శ్రావణ్ కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కడెం



రానున్న ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కొండుకూరు సర్పంచ్ వేణుగోపాల్ కోరారు. బుధవారం మండలంలోని కొండుకూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ఓటర్లకు ఈవీఎంలో ఓట్లు వేయడం పట్ల అవగాహన కల్పించారు. ఈవీఎం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ముఖ్యమైనదని, రానున్న ఎన్నికల్లో తమ విలువైన ఓటు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. బుధవారం గాదిగూడ, ఝరి ఆశ్రమ పాఠశాల, పిహెచ్‌సి, అర్జుని ఆశ్రమ శాటిలైట్ పాఠశాలను సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆసుపత్రిలో వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట పాఠశాల వైద్య సిబ్బంది ఉన్నారు.

కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా చంద్రశేఖర్

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా బాగుల చంద్రశేఖర్‌ను ఎంపిక చేసినట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సంక్షేమ నిధి ఐక్య ఉపాధ్యాయుల సభ్యులకు వరం లాంటిదన్నారు. ఇందులో చేరిన వారు దురదృష్టవశాత్తూ మృతి చెందితే రూ.5లక్షల ఆర్థికసాయం అందుతుందని చంద్రశేఖర్ పేర్కొన్నారు. టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-బోథ్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి సభ్యులు, జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని మర్లపెల్లి, నిగిని, కంటేగావ్, బాబెరతండాలో సుడిగాలి పర్యటన చేశారు. అలాగే పాట్నాపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తానాజీ, ప్రభాకర్ కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ ప్రెసిడెంట్ బూర్గుల మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు నల్ల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సంజీవ్, నిఖిల్, కమలాకర్, సకారం పాల్గొన్నారు.

దళితబంధు కోసం రోడ్డెక్కిన మహిళలు

- ఎమ్మెల్యే వస్తేనే నిరసన విరమిస్తామన్న మహిళలు



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో దళితబంధు వెంటనే అమలు చేయాలని కిర్గుల్(కె) గ్రామ మహిళలు బుధవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. భైంసా-నిజామాబాద్ రహదారిపై శివాజీ విగ్రహం సమీపాన గంటకు పైగా మహిళలు ఎండలో చిన్న పిల్లలతో కలిసి రోడ్డుపై బైటాయించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వచ్చి హామీ ఇచ్చేవరకు కదిలేది లేదని నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. దళితబంధు కింద ఇప్పటి వరకు యూనిట్లు ఎందుకివ్వలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఆందోళనతో రహదారిపై కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి నిరసన విరమించాలని మహిళలను కోరినా ఎమ్మెల్యే వచ్చేవరకు కదిలేది లేదని రోడ్డుపై కూర్చున్నారు. ఎస్సై గణేష్, ఏఎస్ఐ ఉజ్వల మహిళలకు నచ్చజెప్పారు. దళితబంధు విషయమై సమస్య ఉంటే ఎమ్మెల్యేను కలవాలని పోలీసులు సూచించారు. రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలను మహిళ హోంగార్డులతో అదుపులోకి తీసుకున్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ సూచించారు. జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను బుధవారం పట్టణంలోని కేఆర్కే కాలనీ నుండి డిఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ మేరకు ఇంటింటికి తిరుగుతూ వివరాలను సేకరించారు. స్పర్శ లేని మచ్చలు ఉన్నవారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 15రోజులు ప్రతి ఇల్లు తిరుగుతూ అందరిని పరీక్షించి స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వారి జాబితా తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. వారికి సరైన సమయంలో తగు పరీక్షలు నిర్వహించి మందులు వాడినట్లైతే తొందరగా నయమౌతాయని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ మెట్టపల్లి శ్రీకాంత్, పీహెచ్‌సీ అంకోలి డాక్టర్ రాహుల్ గడపాలే, బస్తీ దవాఖానా డాక్టర్ డి.శ్రీనివాస్, డీపీఎంఓ సిడాం వామన్‌రావు, మధుసూదన్‌రావు, ఎల్టీ రమణచారి, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, హెల్త్ అసిస్టెంట్లు నల్ల ఈశ్వర్‌రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, నజియా, సతీష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హౌజ్ అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ పట్టణంలో మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నేషనల్ హైవే దిగ్బంధంలో భాగంగా బుధవారం బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలీసుల హౌజ్ అరెస్ట్‌ను నిరసిస్తూ తన ఇంటి వద్దే నిరాహార దీక్షకు బైటాయించారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీకి సుహాసినిరెడ్డి వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో కొంత కాలంగా హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో యువత గంజాయి సేవిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై బుధవారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట నాయకులు తాటి సతీష్, రవికాంత్, మల్లికార్జున్ ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖానాపూర్



అసలైన పేదలకు ఇళ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్ మాట్లాడారు. పేదల పోరాటం ద్వారా 110 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసినా ప్రభుత్వం ఏ ఒక్కరికి ఇంటి స్థలాన్ని ఇవ్వలేదన్నారు. 400 బెడ్ రూములు నిర్మించి పంపిణీ చేసినప్పటికీ అందులో కూడా కొందరు అనర్హులకు పంపిణీ చేశారని ఆరోపించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలు అనేక మంది ఉన్నారని, పేదలకు ఇవ్వాల్సిన స్థలాలను ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడం సరైంది కాదన్నారు. జాగా లేని నిరుపేదలతో గుడిసెలు వేసుకునే అవకాశం పేదలకు కల్పించాలని, లేనిపక్షంలో తామే గుడిసెలు వేసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే స్పందించి పేదలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, పట్టణ నాయకులు బివి వర్మ మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీట్లకు 25న యాదవ యుద్ధభేరి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు యాదవ, యాదవ ఉపకులాలకు 22 ఎమ్మెల్యే, 7 ఎమ్మెల్సీ, 5 లోకసభ, రాజ్యసభ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25న హైదరాబాద్‌లో నిర్వహించే యాదవ యుద్ధభేరిని జయప్రదం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. బుధవారం యాదవ భవన్‌లో నిర్వహించిన యాదవ విద్యావంతుల వేదిక సమావేశంలో యుద్ధభేరి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాలకవర్గ పార్టీలు గొర్రెలు, బర్రెలు, ఆవుల పేర్లు చెప్పి యాదవులను జీవాల కాపర్లుగా పరిమితం చేసి, కులవృత్తుల చట్రంలో ఇరికించజూస్తున్నారన్నారు. రేపటి యాదవ తరాలను చదువులకు దూరం చేసే కుట్ర తెలంగాణాలో జరుగుతోందన్నారు. కుల వృత్తులకు పరిమితమైతే చదువులు, ఉద్యోగాలు, అధికారానికి దూరం కావాల్సి వస్తుందని పేర్కొన్నారు. అందుకే సీట్లు, ఆర్థిక వాటా, రాజ్యాధికారమే అంతిమబాటగా నినదించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకే యాదవులు గొర్రెల కోసం కాకుండా సీట్ల కోసం గొంతెత్తాలని, ఏ రాజకీయ పార్టీ మాయమాటలకు లోనవకుండా జాగ్రత్తతో వ్యవహరించాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ ఎన్నికల ఎత్తులకు జిత్తులకు లోనవకుండా, పార్టీలకు ఫాలోవర్లుగా మిగిలిపోకుండా యాదవులు అత్యంత ప్రజాస్వామికంగా వ్యవహరించాలని, యాదవుల జనాభాకు తగిన సీట్లు ఇవ్వని పార్టీలకు ఓట్లేయబోమని తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రఘువీర్ యాదవ్, పట్టణ అధ్యక్షులు ప్రఫుల్ యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షులు నారాయణ యాదవ్, మహేందర్ యాదవ్, కావటి రమేష్ యాదవ్, అసుర రమేష్ యాదవ్, ఆశన్న యాదవ్, జైనథ్ మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

వరద నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-బేల



వరదల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం అందించాలని కోరుతూ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతరాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించారు. రోడ్డుపై నిరసన తెలపడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ రాధిక సముదాయించినా ధర్నా విరమించకపోవడంతో బలవంతంగా వారిని అక్కడ నుండి తీసుకెళ్లారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ వరదల వల్ల పంట నష్టపోయి నెల రోజులు గడుస్తున్నా రైతులకు ప్రభుత్వం తరుపున నష్టపరిహారం అందించలేదని, ఇప్పటికే రైతులు రెండు సార్లు అప్పులు చేసి పంటలు వేశారని తెలిపారు. చాలా మంది రైతులు పంట నష్టపోయి ఆపదలో ఉన్నారని, వెంటనే వారికి ఎకరానికి రూ.25నష్ట పరిహారం అందించాలని, లేని యెడల కాంగ్రెస్ పార్టీ తరుపున పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రాందాస్ నాక్లే, వామన్ వాన్‌కడే, శంకర్, అవినాష్, రాకేష్, విపిన్ పాల్గొన్నారు.

మాదిగ ఉప కులాల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా మాదిగ ఉప కులాలకు అన్ని రంగాలలో తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేష్ అన్నారు. మాదిగల సమస్యలను పరిష్కరించడంలో కలెక్టర్ విఫలమయ్యారని ఆరోపించారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించి జిల్లా అధికారుల వైఖరిని ఖండించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మెంబెర్స్‌గా మాదిగలకు అవకాశం లేదని, ఇలా ప్రతి దాంట్లో వివక్షతో అడుగడుగునా మాదిగలను కలెక్టర్ అణిచి వేయాలని చూస్తున్నారన్నారు. సమస్యలను చెప్పడానికి కలెక్టర్‌ను కలవడానికి అపాయింట్మెంటు కోరినా ఇవ్వకుండా సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. త్వరలో హైదరాబాద్ వెళ్లి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సుభాష్, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట



నవతెలంగాణ-బేల

స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో సంవత్సరాలైనా దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని, మహిళలకు సైతం పెద్దపీట వేశారని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపిపి వనితా ఠాక్రే అన్నారు. మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 62మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ మాట్లాడుతూ దేశంలో 29రాష్ట్రాలలో ఎక్కడ కూడా కళ్యాణ లక్ష్మి, షాదీముభరక్ పథకాలు లేవని, కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరేనని అన్నారు. ఎంపిపి వనితా ఠాక్రే మాట్లాడుతూ పథకాల్లో మహిళలకు పెద్ద పీట వేశామన్నారు. ప్రస్తుతం 62మంది లబ్ది దారులకు కళ్యాణ క్ష్మి చెక్కులు అందించామని, ఇటీవలే 40 మంది బీసీలకు ఆర్థిక సాయం చెక్కులను అందించామని అన్నారు. ప్రజల కోసం పాటుపడే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడు మరిచిపోవద్దని, ఎన్నికల సమయంలో చాలా మంది మాయమాటలు చెప్తారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ మహేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రమోద్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, మండల నాయకులు ఒళ్లఫ్‌వార్ దేవన్న, గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, మంగేష్ ఠాక్రె, బండి సుదర్శన్, తేజరావ్ వాడ్కర్, విపిన్, యాసం సతీష్ సంతోష్ పటేల్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరి బాయి అన్నారు. ఇటీవల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఉట్నూర్ డివిజన్ సభ్యుడు కాటం రమేష్ నియమితులైనందున బుధవారం ఆయన నివాసంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి కలిసి సన్మానించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలను నివారించడానికి కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఉట్నూర్ డివిజన్ పరిధిలో ఎస్టీ, ఎస్సీలున్నారని తెలిపారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవ వైవిధ్య నిర్వహణ కమిటీ సభ్యులు మర్సుకోల తిరుపతి ఉన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు మరువలేనివని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం వాజ్‌పేయి వర్ధంతిని పరస్కరించుకొని వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్‌పేయి కృషి అసాధారణమైందని స్పష్టం చేశారు. రాజనీతిజ్ఞుడిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ ప్రజల గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్న వాజ్‌పేయి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పట్టణ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని కోరుతూ శాంతియుత నిరసనకు దిగిన బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని గృహ నిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ మండల నాయకులు బుధవారం కనకపూర్ ప్రధాన కూడలిలో ధర్నా చేపట్టారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పొలాస గోవర్ధన్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, వెంకట్‌రెడ్డి, గాండ్ల చిన్నయ్య, లక్ష్మణ్ ఉన్నారు.

ఇంటింటా లెప్రసి సర్వే

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మహాగావ్ గ్రామంలో బుధవారం హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్ ఆశా కార్యకర్తలతో కలిసి లెప్రసి సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16 నుండి 30 వరకు 14 రోజుల పాటు గ్రామాల్లో సర్వే కొనసాగుతుందన్నారు. ఎవరికైన అనుమాన మచ్చలు ఉంటే వారిని దగ్గరున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. వారి వెంట ఆశా జీజాబాయి ఉన్నారు.

గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-కడెం

మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సంపత్ వనం ఏర్పాటు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో మైసంపేట్ గ్రామ నిర్వాసితులకు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కలెక్టర్ పరిశీలించి సెప్టెంబర్ ఆఖరి కల్లా పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, కడెం సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, ఏపీఓ జయదేవ్, ఎఫ్‌ఆర్‌ఓ అనిత జిల్లా, మండల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎస్‌టీబ్ల్యూఆర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు షీటీం సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎవరైన ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేసిన వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం నుండి గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలన ఎంపీడీఓ శేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన జరుపుతున్నామని ఎంపీడీఓ పేర్కొన్నారు. తదుపరి ఉన్నతధికారుల పర్యవేక్షణలో లబ్ధిదారులను గుర్తించనున్నట్లు తెలిపారు. అర్హులు తమ ధ్రువ పత్రాలను సంబంధిత అధికారులకు అందించి సహకరించాలి సూచించారు.

18న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మిడిల్ డిస్టెన్స్ అండ్ లాంగ్ డిస్టెన్స్ రన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 20న హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు.

మౌలిక వసతులు కల్పించాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుండాల గ్రామ పంచాయతీలో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని మంగళవారం హైదరాబాద్‌లో ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావ్‌ను గుండాల గ్రామ పెసా వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ సురేష్ నాయక్ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో దళితులకు 50 దళితబంధు యూనిట్స్ మంజూరు చేయాలని, గృహలక్ష్మి పథకంలో 50 గృహాలు మంజూరు చేయాలని, గుండాల మహర్‌గూడ నుండి గొట్టి వరకు తారు రోడ్డు, ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో హరితహారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌డీఎఫ్‌సీ అదిలాబాద్ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. చెట్లను నాటడం వల్ల కలిగే పచ్చదనం, వాతావరణ సమతుల్యత, కాలుష్య నివారణ ఇతర ప్రయోజనాలను ప్రిన్సిపాల్ భరద్వాజ వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి.రాజన్న, అధ్యాపకులు క్రాంతికుమార్, శ్రీనివాస్, విజయలక్ష్మి, జ్యోత్స్నరాణి, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నీల్ కమల్, సంగీత, హేమలత, సంతోష్, కార్యాలయ సిబ్బంది రాజేష్, ప్రవీణ్, కిషోర్ కుమార్, శృతి, ఏజాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
గురువారం 17 ఆగస్టు 2023

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-నస్పూర్



మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను బుధవారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పఠాన్ కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో సర్వే నెంబర్ 64లో నిర్మించిన గోడను, ఆర్కె-6 కొత్త రోడ్డు పోచమ్మ గుడి దగ్గర నిర్మించిన షెడ్‌ను తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-దహెగాం



విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేజీబీవీ సెక్టోరియల్ అధికారిని స్వర్ణలత అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ విద్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని కూడా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రిజ్వానతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

- బోరు బావి మరమ్మత్తుల్లో అధికారుల అలసత్వం
- 20 రోజులుగా తాగునీటి ఇబ్బందులు



నవతెలంగాణ-భీమారం

చెడిపోయిన బోరు బావి మోటర్ మరమ్మత్తులు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పోలంపల్లి గ్రామంలోని తాళ్లగూడెం ప్రజలు ఆరోపిస్తున్నారు. గత 20 రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత బోరు బావిపై 20 కుటుంబాలు ఆధారపడిన ఉన్నాయని, సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్లినప్పటికీ అధికారుల పట్టింపు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా సమస్య పరిష్కరించాలని మొరపెట్టుకున్నప్పటికీ మరమ్మత్తుల పేరుతో బోరు మోటర్ తీసి 10 రోజులు గడుస్తోందని, తిరిగి మోటర్ బిగిచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బోరు బావి మరమ్మత్తులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు మాడెం రాజన్న, అనపర్తి శ్రీహరి, చన్న శ్రీరాములు, కోట చిన్న లింగయ్య, మాడెం శ్రీనివాసులు కోరుతున్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన దన్నూరి రాజన్న(24) పాము కాటుకు గురై మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న బుధవారం రాత్రి ఇంటికి వచ్చి నిద్రిస్తుండగా రాత్రి సమయంలో పాము చేతిపై కాటు వేసినట్టు, రాజన్నకు ఉదయం చేతి వాపు రావడంతో పలువురికి తెలియజేయగా వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని పలు రోడ్లకు నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే కోనేరు కొనప్ప తెలిపారు. బుధవారం చితమ్మ గ్రామానికి వచ్చిన ఆయన నిధులు మంజూరు అయని జీఓ కాపిని మండల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రోడ్లు మరమ్మతులకు రూ. 4.50 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు. మండలంలోని గంగపూర్ నుంచి చింతలమానేపల్లి వరకు 4 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.2.60 కోట్లు, కర్జెల్లి నుంచి ముంజంపల్లి వరకు 3 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.1.95 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ముజాకిర్ ఇటీవల మృతి చెందటంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ డుబ్బుల నానయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు నజీం ఉన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



నవతెలంగాణ-జైపూర్

జిల్లా పరిధిలో కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం మిట్టపల్లి, ముదిగుంట, ఇందారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇందారం సర్పంచ్ గడ్డం మంజుల ప్రసాద్, మిట్టపల్లి గ్రామ పంచాయతి సర్పంచ్ కుంటాల సౌజన్యతో కలిసి ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 18 నుండి 31 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. శరీరంపై మొద్దబారిన మచ్చలు ఉన్నట్టయితే ఆరోగ్య కార్యకర్తకు చూపించుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 20 కుటుంబాలతో కుష్టు వ్యాధి సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫయాజ్, జైపూర్ మెడికల్ ఆఫీసర్ అనిల్ పారా మెడికల్ అధికారులు శివకుమార్, కేసీ రాఘవయ్య, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు వసుమతితో పాటు ఆశా కార్యకర్తలు తిరుమల, తిరుపతమ్మ పాల్గొన్నారు.

జోరుగా కొనసాగుతున్న పారిశుధ్య పనులు

నవ తెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పారిశుధ్య పనులు జోరుగా కొనసాగుతున్నాయి. బుధవారం గ్రామ కార్యదర్శి లావణ్య, సర్పంచ్ జాడి గంగాధర్ ఆధ్వర్యంలో మురికి కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రభవలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. బావులలో బ్లీచింగ్ పౌడర్ వేసి క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. ప్రజలు కాచి వడపోచిన నీటిని తాగాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. పారిశుద్ధ కార్మికులు ఆనందం, మల్లేష్ ఉన్నారు.

డ్రైవర్ పట్ల జీఎం నిర్లక్ష్యం : ఎస్‌సీకేఎస్

నవతెలంగాణ-నస్పూర్



కన్వెన్స్ డ్రైవర్ సమస్యను పరిష్కరించడంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ఎస్‌సీకేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. ఇలాంటి కారణం లేకుండా డ్రైవర్‌ను తొలగించినందుకు ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి కన్వేయన్స్ డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌ను గత నెల 10వ తేదీ నుంచి విధులకు తీసుకోకుండా బినామీ ఓనరు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, జీఎంకు అనేక సార్లు మెమోరాండం ఇచ్చిన, ఇప్పటివరకు సమస్యను పరిష్కరించిన పరిస్థితి లేదని పేర్కొన్నారు. అసలు బినామీ ఓనర్ల విషయంలో జీఎం ఎందుకు వెనుకడుగేస్తున్నారని, వారి మీద చర్య తీసుకోవడంలో ఎందుకు ముందుకు రావడం లేదో చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అంతేకాకుండా సర్క్యులర్ ప్రకారం 24 గంటలు నడిచే బండికి ముగ్గురు డ్రైవర్లు ఉండాలని ఉన్న కూడా జీఎం రెండు వెహికల్‌లకు ఐదుగురు కార్మికులు ఉండాల్సింది ముగ్గురిని పెట్టి నడిపిస్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. బినామీ ఓనర్లను వెనకేసి రావడం, ముగ్గురు డ్రైవర్లను పెట్టుకోవాల్సింది ఇద్దరితోనే నడిపిస్తున్న బిల్లులు మంజూరు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి అన్నారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. సింగరేణి సంస్థ, కార్మికుల కష్టార్జితం ఇటు సింగరేణి సంస్థకు కాకుండా అటు కష్టపడే కార్మికుని కాకుండా బినామీ ఓనర్ల కొంగుబంగారంగా మారుతుందన్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తొలగించిన కన్వేయన్స్ డ్రైవర్‌ని 20వ తేది లోపు వీధిలోకి తీసుకోకపోతే మొత్తం కన్వేయన్స్ డ్రైవర్లందరిని కూడా ఈ రిలే దీక్షలో భాగస్వామ్యం చేస్తామని, 11 డివిజన్లకు ఈ పోరాటాన్ని తీసుకుపోతామని, ఇందులో జరిగే బినామీ దందను కరపత్రాలు వేసి కార్మిక వర్గంలోనే కాదు మొత్తం ప్రజల్లోకి తీసుకుపోతామని హెచ్చరించారు.

బీఎస్‌పీతోనే సిర్పూర్ అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



బీఎస్‌పీతోనే సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చెడ్వాయి, ఎలుకపెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. చెడ్వాయి గ్రామంలో అంబేద్కర్ జెండాను ఆవిష్కరించిన అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీతో పెంచికల్‌పేట్ మండలకేంద్రానికి చేరుకున్నారు. మండలకేంద్రంలోని బీఎస్‌పీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని, నియోజకవర్గంలో గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయని, వాటిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదన్నారు. పెంచికల్‌పేట్, దహెగాం మండలాలను కలిపే పెద్దవాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం కాలేదని, కాగజ్‌నగర్, అందవెల్లి వంతెన కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గత నెలలో రావులపెల్లిలో గర్భిణీని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడిందన్నారు. ఎమ్మెల్యే అండదండలతోనే నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యే తనకు అవసరమైన అధికారులను తెప్పించుకోవడంలో సఫలమవుతున్నారని, అభివృద్ధి పనులను మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. సిర్పూర్ పేపర్‌మిల్లులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా స్థానికేతరులకు ఇవ్వడం వల్ల ఇక్కడి యువత ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, బీఎస్‌పీ నాయకులు దుర్గం ప్రవీన్, బాబాజీ, కొండ రాంప్రసాద్, రామిళ్ల దేవాజీ, మహేష్, పాగిడె ఆశన్న, దుర్గం ఆశన్న పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ప్రధాన రహదారిపై రాస్తారోకో



నవతెలంగాణ-కెరమెరి

మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించాలని ధనోర వాటర్ ప్లాంట్ వద్ద ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుండి నేటి వరకు 5 నెలలు కావస్తున్న మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు చెల్లించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. అరకొర వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. జీఓ నెంబర్ 60 ప్రకారము రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల వేతనాలు చెల్లించినప్పుడే కుటుంబ పోషణ సాధ్యపడుతుందన్నారు. నెలల తరబడిగా మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా యాజమాన్యాలు పట్టించుకోకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే మిషన్ భగీరథ కార్మికుల వేతనాలను చెల్లించని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గం లింగయ్య, శ్రీకాంత్, విఠల్, భీమరజ్, బుడ్డయ్య, అంకుష్, శంకర్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డీడీ

నవతెలంగాణ-బెజ్జూర్



మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం డీడీ రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలు, భోజన వసతి గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో పురుష ఉపాధ్యాయులు ఉండకుండా చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా బెజ్జూర్ నుండి ఐదుగురు సీఆర్‌టీలను ఇతర పాఠశాలలకు పంపించినట్టు ఆమె తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో మహిళా సీఆర్‌టీలు ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎనిమిది ఆశ్రమ పాఠశాలల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తున్న పురుషులను తొలగించి వారి స్థానంలో మహిళా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించామన్నారు. విద్యార్థినిల పట్ల లైంగిక వేదింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పార్తిరాంను సస్పెండ్ చేశామని ఆమె తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆశ్రమ పాఠశాలలో పీఈటీ కొరత ఉందని, వెంటనే పీఈటీని నియమించాలని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించి త్వరలోనే పీఈటీని నియమించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఆమె వెంట జీసీడీఓ శకుంతల, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మారుబాయి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-భీమారం

నూతనంగా ఏర్పాటు చేసిన భీమారం మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ నాయకురాలు రామిళ్ల రాధిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు ఆ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. కేసీఆర్ ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన మండల కేంద్రాల్లో కనీసం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరం అన్నారు. ఆరోగ్య కేంద్రం లేక విద్యార్థిని దుర్గం భారతి(16) పాము కాటుతో మృతి చెందిందని గుర్తు చేశారు. కనీసం 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో సమయానికి వైద్యం అందక అనేక మంది అవస్తలు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు.

రోడ్డుకు మరమ్మత్తులు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఖర్జీ గ్రామం నుండి మారుమూల లోహా గ్రామానికి పోలీసుల ఆధ్వర్యంలో ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై సనత్‌కుమార్ మరమ్మత్తులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు చాలాచోట్ల తెగిపోయి నడవలేని పరిస్థితికి చేరుకోవడంతో జేసీబీ సాయంతో మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై సనత్‌కుమార్ మాట్లాడుతూ మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలకు పోలీసుల సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఎలాంటి అవసరాలున్నా తమను సంప్రదించవచ్చని సూచించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, పోలీస్ సిబ్బంది నారాయణ ఉన్నారు.

క్యాంపు కార్యాలయాన్ని ఇందారం శివారులో ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జైపూర్

టేకుమట్ల శివారుల్లో ఏర్పాటు చేసిన ఐకే-1ఏ ఓపన్‌కాస్ట్ గని క్యాంపు ఆఫీసు ఇందారంలో ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతి వార్డు సభ్యులతో పాటు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంధర్భంగా బుధవారం ఐకే-1ఏ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్‌ను కలిసి వినతీ పత్రం అందజేశారు. ఐకే-1ఏ ఓసీ ఏర్పాటులో అత్యధికంగా భూములను నష్టపోయింది. ఇందారం శివారు భూములే అయినందున ఇందారం శివారుల్లోనే క్యాంపు ఆఫీస్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఐకే ఓసీ ఏర్పాటు భూములిచ్చి సహకరించిన ఇందారం గ్రామ పంచాయతి ప్రజల సౌకర్యార్థం కనీస మౌళిక వసతులు కల్పించాలని ప్రాజెక్టు ఆఫీసర్‌కు ఇచ్చిన వినతీ పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అమీరుద్దీన్, షరీఫ్, సాయికిరణ్, రాకేశ్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

రైస్ మిల్లును తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-జన్నారం

మండలం కలమడుగులోని శ్రీ లక్ష్మీనరసింహ రైస్ మిల్లును తహసీల్దార్ వనజారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైస్ మిల్లర్ల నిర్వాహకులు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్‌ను త్వరగా ఇవ్వాలని ఆదేశించారు. రైస్ మిల్లులో ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా రైస్ మిల్‌లను సక్రమంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ భానుచందర్ ఉన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



మండలకేంద్రంలోని దుబ్బగూడెం కాలనీకి చెందిన ఎలుములె రాందాస్(30) అనే కౌలు రైతు పాము కాటుతో మృతిచెందాడు. బుధవారం కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీన ఎలుములె రాందాస్ కౌలుకు తీసుకున్న పొలంలో పనులు చేస్తున్న క్రమంలో పాము కాటు వేయడంతో కింద పడిపోయాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు వారు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సునీత రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. రాందాస్‌కు ఎలాంటి భూమి లేకపోవడంతో కౌలు చేసుకుంటున్నాడని, ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నట్టు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోఅనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని పరిసర ప్రాంతాల గ్రామాలకు చెందిన 30 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని 28, 33, 34, 12, 14 వార్డులలోని 350 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. 36 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రజల బాగోగులకోసం, పట్టణ ప్రగతి కోసం ఎంతగానో కషి చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్వేత, వైస్ ఛైర్మన్ సుదర్శన్, కౌన్సిలర్ సంగీత, అస్ఫర్, బొడ్డు నారాయణ, గెల్లి రాయలింగు, శ్రీలత, షేక్ ఆస్మ యూసఫ్, సురేష్ పట్టణ అధికార ప్రతినిధి కాసర్ల యాదగిరి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మొర్రిగూడ, టీజీపల్లి, ఇందనపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఎల్.కిషోర్ కుమార్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ వనజారెడ్డికి సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. త్రాగునీరు మరుగుదొడ్లు, విద్యుత్తు ఫ్యాన్లు, బెంచీలు కుర్చీలు, అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు.

కొనసాగుతున్న గృహలక్ష్మి దరఖాస్తుదారుల సర్వే

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో గృహలక్ష్మి దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతోంది. బుధవారం ముదిగుంట గ్రామంలో చేపట్టిన సర్వే తీరును ఎంపీడీఓ సత్యనారాయణ పరిశీలించారు. నాలుగు కష్టర్లుగా విభజించి గ్రామ పంచాయతి కార్యదర్శులతో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలో గల వివిధ గ్రామ పంచాయతీల ద్వార 2,176 మంది గృహ లక్ష్మి పథకం ద్వార లబ్దిపొందుటకు ధరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల వారిగా లబ్ధిదారుల కుటుంబాలు సర్వే చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 20 లోపు సర్వే పూర్తి చేసి పూర్తి వివరాలతో కూడిన జాబితాను కలెక్టర్ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతి కార్యదర్శులు సర్వే నిక్కచ్చిగా పూర్తి చేసి సకాలంలో మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆయుర్వేద వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

నాగపూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆయుర్వేద వైద్య పరీక్షలను ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకోవాలని జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 18వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు దీర్ఘకాలిక రోగాలు బీపీ, షుగర్ లాంటి వ్యాధులు కీళ్ల నొప్పులు నడుము నొప్పులు వంటి వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

రైతు బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని లంబాడీహెట్టి గ్రామానికి చెందిన జర్పుల పారుశురాం అనారోగ్యంతో గత కొన్ని రోజుల క్రితం మృతి చెందగా, అతని భార్య జర్పుల నిర్మలా కు రైతు బీమా చెక్కును ఎంపీపీ డుబ్బుల నానయ్యా అందించరు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజిమ్ హుసేన్, ఎంపీటీసీ ధన్‌రాజ్, బానోత్ శ్యంలాల్, జార్పుల తిరుపతి, అజ్మీర వసంత్, తొంప్రే సురేష్, ఏఈఓ కృపామని ఉన్నారు.



డబ్బా పీజీ హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామ జడ్‌పీఎస్ఎస్ పీజీ హెచ్‌ఎం అరుణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సాయికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక మతతత్వ సంఘం నిర్వహించిన జెండావిష్కరణ కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ్‌కుమార్ పాల్గొనడమే కాకుండా, పాఠశాల విద్యార్థులను కూడా అక్కడికి తీసుకువెళ్లి నిబంధనలను ఉల్లంఘించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మతతత్వ భావజాలాన్ని విద్యార్థులకు ఇప్పటినుండే అలవరుస్తున్న హెచ్‌ఎంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఫిర్యాదుతో జత చేశారు.

బోదకాలు వ్యాధి నివారణ మాత్రలు వేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రతి ఒక్కరు తప్పనిసరిగా బోదకాల వ్యాధి నివారణ మాత్రలు వేసుకోవాలని వరంగల్ మలేరియా జోనల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలో ఆగస్టు 10 నుంచి చేపట్టిన (ఎండీఏ)బోదకాలు వ్యాధి నివారణ మందుల పంపిణీ కార్యక్రమం పనితీరును పరిశీలించారు. మండలంలోని తపాలాపూర్, చింతగూడ, పైడిపల్లి గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి, ఇంటింటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామ ప్రజలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, మండల వైద్యులు డాక్టర్ ఉమాశ్రీ, సూపర్‌వైజర్‌లు పోసాని, రాంబాబు, కొల్లూరి కమలాకర్, అపరంజి, ఆశ కార్యకర్తలు లలిత, మంజుల, కళావతి, వజ్రమాల, అంగన్‌వాడీ టీచర్‌లు కవిత, శ్రీవాణి, సునీత పాల్గొన్నారు.

క్రైస్తవుల హక్కులు కాపాడాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

క్రైస్తవుల పట్ల వివక్ష చూపకుండా, వారి హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని సిర్పూరు నియోజకవర్గ పాస్టర్స్ కోరారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని మన్రేమే చర్చిలో నియోజకవర్గ పాస్టర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రైస్తవులకు ఇచ్చిన హక్కులను కాపాడుతూ, వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. దేశవ్యాప్తంగా క్రైస్తవ మైనార్టీల మీద జరుగుతున్న దాడులను అన్ని రాజకీయపార్టీలు ఖండించాలని కోరారు, క్రైస్తవులకు అండగా నిలిచే పార్టీలకే రాబోయే రోజులలో ఓటు వేయాలని తీర్మాణించారు. ఇన్ని రోజులు క్రైస్తవ ఎమ్మెల్సీగా పని చేసిన రాజేశ్వర్‌రావును క్రైస్తవ మైనార్టీ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిర్పూరు తాలూకా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు విల్‌ఫ్రెడ్, ఉపాధ్యక్షులు యేసు కుమార్, గౌరవ అధ్యక్షులు తిమోతీ జయరాజ్, సుకుమార్, సునీల్, శ్రీనివాస్, లింగమూర్తి పాల్గొన్నారు.

ఐచర్‌వ్యాన్, బైక్ ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని కాగజ్‌నగర్‌కు వెళ్లే రహదారిపై రాంపూర్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కాగజ్‌నగర్ నుండి రెబ్బెన వైపు పాల ప్యాకెట్లతో వెళ్తున్న ఐచర్‌వ్యాన్ ఆసిఫాబాద్ వైపు నుండి కాగజ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆసిఫాబాద్‌కు చెందిన మహమ్మద్ షెకిల్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు.

నియంత ప్రభుత్వాన్ని గద్దె దించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎన్నికల సమయంలో హామీలిచ్చి గెలిచిన తర్వాత వాటిని అమలు చేయని ఈ కేసీఆర్ నియంత ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశం ఒక ప్రకటనలో కోరారు. 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయని కేసీఆర్, సిర్పూరు నియోజకవర్గానికి ప్రాణప్రదాయిని అయిన ప్రాణహిత ప్రాజెక్టును కూడా ఇక్కడి నుండి తరలించి మోసం చేశాడని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

మరోసారి బీఆర్ఎస్ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ పార్టీని మరోసారి గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకురాలు, జాదవ్ సుమన్ భాయ్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ రాంపూర్, తపాలాపూర్ గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను, ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అలుగునూరి సులోచన రవి, తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్ తపాలాపూర్ సర్పంచ్ నైనాల తిరుపతి ఉప సర్పంచ్ రాజు, శ్రీను, రవి, ప్రభు, మల్లేష్, రవి గౌడ్ అశోక్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు టైం స్కేల్ ఇవ్వాలని రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేసి వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతి కుమారి, ఇందురావులు ఒక ఉమ్మడి ప్రకటనలో డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు టైం స్కేల్, రెగ్యులరైజేషన్ కోసం ఉద్యమం చేయడం నేరం కాదని సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయకపోగా అరెస్టు చేయడం భావ్యం కాదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రకటనలో కోరారు.

సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రిసర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో బుధవారం ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లు, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, అస్తమా, స్త్రీల వ్యాధులపై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరాన్ని ఉద్యోగులు, గ్రామస్తులు, సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబసభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పార్టీని వీడుతున్నట్టు అసత్య ప్రచారాలు నమ్మొద్దు : వివేక్ వెంకట స్వామి

నవతెలంగాణ -వేమనపల్లి

తాను బీజేపీని వీడుతున్నట్లు కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రానికి చెందిన కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుముల వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు బైస మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమందా రమేష్, అందుగుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేవైఎం అధ్యక్షుడు పత్తి వెంకటకృష్ణ, మండల ఉపాధ్యక్షులు ఏట మధుకర్, తలండి రమేష్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, బట్టు మల్లేష్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి

నవతెలంగాణ-తలమడుగు

అర్హులైన బీసీ కులవృత్తులందరికీ లక్ష ఆర్థిక సాయం అందించాలని బుధవారం బీఆర్ఎస్ మండల శాఖ తరపున ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 28 గ్రామపంచాయతీలోని బీసీ కులవృత్తుల జాబితా బీసీ కార్పొరేషన్ అధికారికి అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, రైతుబంధు మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి, జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, దేవాపూర్ సర్పంచ్ అబ్దుల్లా, లక్ష్మీపూర్ రాజేశ్వర్, దూస సంతోష్, శాస్త్రి ఉన్నారు.

ఎమ్మెల్యేల అసమర్థతతోనే కాళేశ్వరానికి తరలింపు

- బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- దహెగాంలో రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్ర



నవతెలంగాణ-దహెగాం

కాళేశ్వరం ప్రాజెక్టు తుమ్మిడిహేటి నుండి తరలిపోవడానికి తూర్పు ప్రాంత ఎమ్మెల్యేల అసమర్థతే కారణమని బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా దహెగాం మండలకేంద్రానికి బుధవారం బైక్ ర్యాలీతో చేరుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తూర్పు ప్రాంతం చుట్టూ నదులున్నా ఎడారిని తలపిస్తుందన్నారు. తుమ్మిడిహేటిలో ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఈ ప్రాంతమంతా రెండు పంటలు పండించి సస్యశ్యామలంగా మారేదని, అలాంటి ప్రాజెక్టును కాళేశ్వరంలో కట్టించి కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు నీళ్లను తరలించుకుపోయిన ఈ ప్రాంత ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ నియంతపాలన కొనసాగిస్తూ రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములను విక్రయిస్తున్నారని, నిరుపేదలకు మాత్రం కట్టుకోవడానికి ఇండ్ల స్థలాలు కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు శాంతియుత ఉద్యమం చేసినా కూడా ప్రభుత్వం వారిని అణచివేస్తుందన్నారు. ఇలాంటి పాలన పోవాలంటే బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సిర్పూర్ నియోజకవర్గంలో దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలు అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి పోయాయన్నారు. దహెగాం మండలవాసులకు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొన్నప్పటికీ ఎమ్మెల్యే చేస్తున్నాం, చూస్తున్నాం అన్నట్టుగానే వ్యవహరిస్తుండడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. పెంచికల్‌పేట్ వద్ద పెద్దవాగుపై వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు పూర్తికాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోప్రక్క అందవెల్లి వంతెన కూలిపోయిన ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మించాల్సిన వంతెనను ఆలస్యం చేసి అవస్థలు పడేలా చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అనుచరులు నియోజకవర్గంలో భూకబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను బహుజన యాత్ర ద్వారా తెలియజేస్తూ ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ప్రజలకు మెరుగైన అభివృద్ధి జరగాలంటే, బహుజన వాదం ముందుకెళ్లాలంటే, బహుజనులకు రాజ్యాధికారం దక్కాలంటే బెహంజి మాయావతి నాయకత్వంలో బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మండలంలో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిడాం గణపతి, నియోజకవర్గ అధ్యక్షుడు కొండా రాంప్రసాద్, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రవీన్, నాయకులు జిల్లెల తిరుపతి, దుర్గం దేవిదాస్, శంకర్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలి

- సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు ఆర్ త్రివేణి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆశ వర్కర్లు తమ సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్దం కావాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు ఆర్ త్రివేణి సూచించారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే ఆశా వర్కర్లు పోరాటాలు చేసినా ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. అవసరమైతే ఆశా వర్కర్లు సమ్మెకు కూడా సిద్ధం కావాలని సూచించారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న విధంగా రూ. 10 వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 2022, డిసెంబర్ ఆరు నుండి నిర్వహించిన లెప్రసీ సర్వేకు అదనంగా డబ్బులు చెల్లించాలని, టీబీ స్పూటమి డబ్బాలను ఆశాలతో మోపించే పనిని రద్దు చేయాలని, పని భారం తగ్గించాలని, జాబ్ ఛార్ట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు కృష్ణమాచారి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ పద్మ, నాయకులు భాగ్య, పూజ, పంచశీల, మంజుల, సంధ్య, శోభ, సుమలత, స్వరూప పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేపీ రాస్తారోకో

నవతెలంగాణ-దహెగాం

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మండలంలోని లగ్గాం క్రాస్ రోడ్డు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని ఎద్దేవ చేశారు. ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారికి అందకుండా అనేక అడ్డంకులను పుట్టిస్తూ నిబంధనల పేరిట పథకాలు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కోంద్ర తిరుపతిగౌడ్, బీజేపీ నాయకులు పుల్లం నారాయణ, ఎలుకరి దామోదర్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, రోశన్, బొర్కుట్ మల్లేష్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను గుర్తించండి

నవతెలంగాణ-తాండూర్



గృహలక్ష్మి సర్వేలో అర్హులైన లబ్ధిదారులనే గుర్తించి ఈ నెల 19వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలంలోని పంచాయతీ సెక్రెటరీలకు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో మిగిలి ఉన్న ప్లాంటేషన్ పూర్తిస్థాయిలో చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకున్నటువంటి రైతులకు ఎంపిక చేసిన రైతులు రైతు పండ్లతోటల పెంపకానికి సిద్ధంగా ఉండేటట్లు సమాయత్తం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్య పనుల నిర్వహించాలని 100 శాతం ఇంటి పన్నులు వసూళ్లు అయ్యేలా ఇప్పటినుంచి కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ ఏపీఓ నందకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ భారత ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మాజీ భారత ప్రధాని దివంగత నేత అటల్ బిహారీ వాజ్‌పాయి వర్ధంతిని బుధవారం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక గద్దెరాగడి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు వైద్య శ్రీనివాస్ ఓబీసీ పట్టణ అధ్యక్షుడు పాల రాజయ్య, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్, రాజసమ్ముల రాజశేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

సమస్య తెలుసుకొని వెంటనే స్పందించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఇందిరానగర్ వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్లడంతో మూడు రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక విద్యార్థిని, విద్యార్థులు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకున్న జడ్పీటీసీ వేముర్ల సంతోష్ ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం కళాశాలను సందర్శించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరింపచేశారు. మిషన్ భగీరథ నీటి పైపులైన్‌కు కూడా సంబంధిత అధికారులను పిలిచి దగ్గరుండి మరమ్మత్తులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. సమస్య తన దృష్టికి రాగానే వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరాను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-భీమారం



గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ బి.రాహుల్ గ్రామ పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని బూరుగుపల్లి, నర్సింగాపూర్, ఖాజీపల్లి, దాంపూర్ గ్రామ పంచాయితీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతి కార్యక్రమంలో బాగంగా చేపట్టాల్సిన పనులపై సంబంధిత గ్రామ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్ కావడంతో డెగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, పంచాయితీల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీని సందర్శించిన డైరెక్టర్

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీని బుధవారం డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు జి.వెంకటేశ్వర్‌రెడ్డి జీఎం డి.రవిప్రసాద్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి ఉత్పాదకత, సివిల్ పనులపై సమీక్షించారు. బేస్ట్ క్యూ అండ్ నుండి ఖైరిగూడ ఓసీ పని స్థలాలను వీక్షించారు. ఇన్‌ఫిట్ క్రషర్ ఖైరిగూడ ఓసీ నుంచి డోర్లి 1కు వెళ్లే రోడ్డు డైవర్షన్ వంతెనను ఆయన పరిశీలించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులకు, సిబ్బందికి మార్గానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుమలరావు, ఖైరిగూడ పీఓ ఎం.సత్యనారాయణ, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వ్యాధులపై వైద్యుల సలహాలు తీసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, స్థానికంగా ఉన్న వైద్యుల సలహాలు తీసుకొని వారి సూచనల మేరకు వైద్యం చేయించుకోవాలని లోనువెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివ అన్నారు. బుధవారం మండలంలోని నవెగాం గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో షుగర్, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కుష్టువ్యాధి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఈ సీజన్‌లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర వ్యాధులు సోకే ప్రమాదముందని, ఎలాంటి అనారోగ్యంగా ఉన్నట్లయితే హుడ్కిళి గ్రామంలో ఉన్న వైద్య ఉపకేంద్రంలో చూపించుకోవాలన్నారు. ఎలాంటి మూఢనమ్మకాలు, అపోహలు నమ్మకుండా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు. క్యాంపులో సబ్‌సెంటర్ మిడ్‌లెవల్ హెల్త్ కొవైడర్ దుర్గం శరణ్య ఏఎస్ఎం విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సర్పంచ్ సపాట శంకర్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వినతిపత్రం అందించారు. బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సపాట్ శంకర్, బీఆర్ఎస్ నాయకులు బూడిద రమేశ్, పెంటపర్తి ప్రశాంత్, చెన్నూరి లక్ష్మణ్, బండి శంకర్, అజ్మీర లక్ష్మణ్, బోగె సత్తి పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడలో ఆర్కే-5 గనికి మొదటి బహుమతి

నవతెలంగాణ-నస్పూర్

ఆజాదిక అమృత మహోత్సవంలో భాగంగా కేంద్రం తలపెట్టిన స్వచ్చత పక్వాడలో 2023 శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గని ఉత్తమ గనిగా మొదటి బహుమతికి ఎంపికైది. మంగళవారం నిర్వహించిన 77వ స్వాతంత్ర్య వేడుకల్లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి చేతుల మీదుగా గ్రూప్ ఏజెంట్ ఎ.వి.రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్‌లు మొదటి బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారంగనిలో అభినందన సభ నిర్వహించారు. గని ఇన్‌చార్జ్ మేనేజర్ శివయ్య మాట్లాడుతూ జూన్ 16 నుంచి 30 వరకు తలపెట్టిన సచ్చత పక్వాడ కార్యక్రమంలో ప్రతీ ఒక్క ఉద్యోగి గని పరిసరాలను అద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. స్వచ్ఛందంగా ప్రతీ రోజు ఉదయం విధులు ముందు పరిసరాల పరిశుభ్రత నిర్వహించి ఏరియా స్థాయిలో గుర్తింపు తెచ్చారని అభినందించారు. ఇప్పటికే గని పరిసరాల్లో ప్లాస్టిక్ నిషేధం నిర్ణయాన్ని కొనసాగిస్తూ స్వచ్చత అనేది ఆర్కే-5 గనిలో ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ రాందాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

నవతెలంగాణ-జన్నారం

రాఘవేంద్ర లిటిల్ హాండ్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పెద్దలతో ఎలా మెలగాలి చిన్న వారితో ఎంత ప్రేమగా ఉండాలి అనే అంశాల పట్ల, మోటివేషన్ ఉపాధ్యాయులు మనీష్, రంజిత్ విద్యార్థులకు తెలిపారు. గతంలో వివిధ సందర్భాల్లో రాష్ట్రంలో జిల్లాల్లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరిమల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, రాఘవేంద్ర లిటిల్ హాండ్స్ హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎంపీటీసీ మధుసూదన్ పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధి షెట్‌పల్లి గ్రామ పంచాయతిలో రూ.5 లక్షలతో ఓపన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ మేడి రవి తెలిపారు. స్థానిక రామాలయం సమీపంలో దాతలు సమకూర్చిన పట్టా భూమిలో జిమ్ ఏర్పాటు కొనసాగుతుందని తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్కసుమన్ సహకారంతో ఓపన్ జిమ్ ఏర్పాటుతో పాటు గ్రామ పంచాయతి పరిధిలో రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. పల్ల రాకేష్ ఇంటి నుండి కొరకొప్పుల శంకరమ్మ ఇంటి వరకు డ్రైనేజీ పనులు పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు.

బీడీ ప్యాకర్లకు రూ.2016 భృతి ఇవ్వాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-నిర్మల్



ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో బీడీ ప్యాకర్లకు రూ.2016 జీవన భృతి అమలు చేస్తామని ప్రకటించిన విధంగా అమలు చేయాలని బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నివాసంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి పంచాయతీ కార్యదర్శి, లేబర్ శాఖ కార్యదర్శితో ఫోన్లో మాట్లాడి బీడీ ప్యాకర్స్ నెలసరి ఉద్యోగులు కార్మికుల దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం కేసిఆర్‌తో మాట్లాడతానని, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, ఎం. బక్కన్న, ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న కె.లక్ష్మి, గంగామణి, లక్ష్మి, గఫూర్, కిషన్ రాజేందర్, ఉత్తమ్, పోశెట్టి, ఫెరోజ్, జనార్ధన్, బీడీ ప్యాకర్లు ఉన్నారు.